క్లుప్తంగా...

మాజీ సర్పంచ్ కుటుంబానికి మంత్రి పరామర్శ

శంషాబాద్: గొల్లపల్లి మాజీ సర్పంచ్ జిట్ట సిద్దులు కుటుంబాన్ని రాష్ట్ర గనుల శాఖ మంత్రి పి. మహేందర్‌రెడ్డి పరామర్శించారు. జిట్ట సిద్దులు కుటుంబసభ్యురాలు ఇటీవల మృతి చెందడంతో బుధవారం వారి ఇంటికి వచ్చిన మంత్రి సిద్దులు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కె.చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

నోవాటెల్‌లో 15 వసంతాల వేడుక

శంషాబాద్: ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు, ప్రముఖులకు ఆతిథ్యం అందిస్తోన్న నోవాటెల్ బుధవారం 15 వసంతాల వేడులను × హార్వెస్ట్ గ్రాటిట్యూడ్ వీక్ × నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఉద్యోగులు, వాటాదారులు, అతిథులకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఆతిథ్య రంగంలో నోవాటెల్ తన ప్రయాణంలో ఎన్నో మైలు రాళ్లను దాటిందని జనరల్ మేనేజర్ సుఖ్‌బీర్ సింగ్ అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు విభిన్నమైన.. వినూత్న మార్పులను నోవాటెల్ ఆహ్వానిస్తోందన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి

అత్తాపూర్: డివిజన్ పరిధిలో రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని శివానగర్ కాలనీలో రూ.6.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటికి అనుగుణంగా నిధులను రాబట్టి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ పీఓ రాధారాణి, బీజేపీ నాయకులు ఎస్.వెంకటేశ్, బి. సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 7వ డివిజన్ పీఎన్‌టీ కాలనీలో రూ. 33 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ముజావుద్దీన్, నదీం, రాజు పాల్గొన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

శంషాబాద్ రూరల్: కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదన్‌పల్లి పాతతండా బస్టాండ్ వద్ద బెంగళూరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి వేగంగా వెళ్తున్న కారు గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రంగారెడ్డి అర్బన్ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా వనితా రెడ్డి



వనితా రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

అత్తాపూర్: బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యదర్శిగా రాజేంద్రనగర్ సర్కిల్, హైదర్‌గూడకు చెందిన ఎం.వనితా రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్.కృష్ణవేణి ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి చేతుల మీదుగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు కొమిరెడ్డి ఉమా మహేశ్వర్ రెడ్డితో కలిసి వనితా రెడ్డి నియమాక పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ... పార్టీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. వనితా రెడ్డి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ప్రజలు, పార్టీ కోసం పని చేస్తానన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ బీజేపీ నాయకులు వై.శ్రీధర్, ఎస్.మల్లారెడ్డి, ఎం.కొమురయ్య, పి.మల్లేష్ యాదవ్‌ల నేతృత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

మహిళా బిల్లు అభినందనీయం

అత్తాపూర్: మహిళా బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపి లోక్‌సభ, రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టడం పట్ల బుధవారం జనహిత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు స్వీట్లు పంపిణీ చేశారు. సొసైటీ ప్రతినిధులు ఉమామహేశ్వరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ నిర్మాణాలకు అనుమతి లేదు



గతంలో విల్లాలను కూల్చివేసిన దృశ్యం (ఫైల్)



కొనసాగుతున్న విల్లాల నిర్మాణం

గతంలో కూల్చివేసిన హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీ అధికారులు

- పునరుద్ధరిస్తున్న అక్రమార్కులు
- అధికారులకు అడ్డుపడుతున్న ప్రజా ప్రతినిధులు

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు అక్రమ నిర్మాణాల నియంత్రణలో చేష్టలుడిగి చూస్తున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా సైతం అనుమతులు లేవని స్పష్టంగా తేల్చిచెబుతున్నా అధికారులు క్షేత్ర స్థాయిలో అక్రమకట్టడాల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలె విఫలమవుతున్నారు. ఇందుకు అనేక ఉదాహరణతో పాటు కారణాలు ఉన్నాయి..

అప్పట్లో కూల్చి...

సర్వేనంబరు 86,87,88లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతుండటంతో గతంలో హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీ అధికారులు సంయుక్తంగా వాటిని కూల్చివేశారు. వీటితో పాటు పట్టణంలో అక్రమంగా వెలిసిన షెడ్లతో పాటు నిర్మాణాలపై చర్యలు తీసుకున్నారు. అయితే ఆ తర్వాత కొన్ని రోజులకే ఆయా నిర్మాణాల్లో కొన్నింటిని తిరిగి నిర్మించగా, మరికొన్ని నేటికీ కొనసాగుతున్నాయి. ఇందులో విల్లాల నిర్మాణం జరుగుతున్నా అధికారులు వాటి జోలికి పోవడం లేదు. ఆయా నిర్మాణాలకు సంబంధించి న్యాయ స్థానంలో భూ వివాదం సైతం ఉన్నప్పటికి అక్రమార్కులు యథేచ్ఛగా తమ పని పూర్తి చేస్తున్నారు.

అవును..లేదు... కానీ..

కొన్ని విల్లాలతో పాటు పట్టణంలో మిగతా నిర్మాణాలకు కూడా అనుమతులు లేవు.. ఇవ్వలేదు.. అని సమాధానం ఇస్తున్న అధికారులు ఆర్‌టీఐ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎలాంటి అనుమతులు జారీ చేయలేదని స్పష్టంగా పేర్కొంటున్నప్పటికీ తాము చేయాల్సిన పనులు మాత్రం పక్కన పెట్టేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజా ప్రతినిధుల ఆదేశాలతోనే..

మున్సిపాలిటీలో పట్టణ ప్రణాళికా విభాగానికి టౌన్‌ప్లానింగ్ అధికారితో పాటు మరో అధికారి, చైన్‌మెన్ ఉన్నారు. వీరు పట్టణంలో అక్రమ నిర్మాణాలను నియంత్రించాల్సి ఉంటుంది. అయితే వారు తమ విధులు నిర్వహించడం ఇప్పుడు సమస్యగా మారింది. తమ అనుమతి లేనిదే ఆయా ప్రాంతాల్లోకి కూడా వెళ్లకూడదని కొందరు నేతలు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలోనే అధికారులకు దిశానిర్దేశం సైతం చేశారు. అప్పటి నుంచి పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది అక్రమ కట్టడాల నియంత్రణపై చేతులెత్తేశారు.

111 జీఓపై స్పష్టత కరువు

జీవో 111 ఎత్తివేతపై ప్రభుత్వం ప్రకటించినా అందుకు ప్రత్యామ్నాయ చర్యలపై నేటికీ ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాలేదు. జీవో111 తొలగిస్తే ప్రభుత్వం నుంచి నేరుగా అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టేందుకు అవకాశం ఉండేది. అయితే నేటికీ టీఎస్‌బీపాస్‌లో సాతంరాయి రెవెన్యూతో పాటు హెచ్‌ఎండీఏ సొంతంగా అభివృద్ధి చేసిన హుడాకాలనీ, ఎయిర్‌పోర్టు కాలనీలను మాత్రమే పరిగణలోకి తీసుకుని అనుమతులు జారీ చేస్తున్నాయి. పట్టణంలో మిగతా ప్రాంతాల్లో నేటికి అనమతులు ఇవ్వడం లేదు.

“ అనుమతులు లేవు..

సర్వేనంబరు 86,87,88 లోని విల్లాల నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు జారీ చేయలేదు. సంబంధిత నిర్మాణాలకు పలుమార్లు నోటీసులు జారీ చేశాం. సాతంరాయి రెవిన్యూ, హెఎండీఏ సొంతంగా అభివృద్ధి చేసిన లేఅవుట్‌లోనే అనుమతులు జారీ అవుతున్నాయి.. మిగతా ప్రాంతాల్లో అనుమతులకు సంబంధించి ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు అందలేదు.

– శ్రీనివాస్, శంషాబాద్ టౌన్‌ప్లానింగ్ అధికారి

రహదారి విస్తరణ పనుల పరిశీలన

రహదారి విస్తరణపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



శంషాబాద్ రూరల్: బెంగళూరు జాతీయ రహదారి పనులను బుధవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పరిశీలించారు. మండలంలోని పెద్దషాపూర్ బస్టాప్ వద్ద రహదారి విస్తరణలో వాహనదారులకు ఇబ్బందులు లేకుండా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు విన్నవించడంతో ఆయన అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. రోడ్డు దాటే సమయంలో వివిధ గ్రామాల ప్రజలు, విద్యార్థులు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెక్కల చంద్రశేఖర్, ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీ రాజు, ఎంపీటీసీ ఎల్లయ్య, ప్రాజెక్టు మేనేజర్ నాగేశ్వర్‌రావు, కో–ఆప్షన్ సభ్యుడు గౌస్, మాజీ సర్పంచు సత్యనారాయణగౌడ్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మహిళల కల నెరవేర్చారు



కార్పొరేటర్‌తో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

మైలార్‌దేవ్‌పల్లి: చట్ట సభల్లో రిజర్వేషన్ల కొరకు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మహిళల కలను ప్రధాని నరేంద్రమోదీ నేరవేర్చారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కాటేదాన్‌లోని పార్టీ కార్యాలయంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి మహిళ మోర్చా అధ్యక్షురాలు ఉడుత లక్ష్మి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..దేశంలో మహిళా లోకం ఎదురుచూస్తున్న చట్టసభల్లో 33శాతం బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. మహిళల సాధికారతను పెంపొందించడానికి మరో చారిత్రాత్మక నిర్ణయం తీసునే సత్తా భాజాపాకే ఉన్నదన్నారు. గత 70 ఏళ్లల్లో ఏ ప్రభుత్వం చేయని సహసం చేసిన ప్రధాని నరేంద్రమోదీ చరిత్రలో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అడికె జనార్దన్ ,రాజేంద్రనగర్ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు విజయ్ ,లక్ష్మి, భాగ్య, సువర్ణ, లత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

శంషాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 22 వేల ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేశవులు, ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రెహమాన్ అన్నారు. బుధవారం వారు ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగులు గత 21 రోజులుగా చేపడుతున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్టు ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు అజీజ్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో పీఆర్‌టీయూ జిల్లా నేతలు

పశువైద్యులకు శిక్షణపై అవగాహన ఒప్పందం

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పీ.వీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, సద్గురు మేనేజ్మెంట్ కన్సల్టెన్సీ మధ్య పరస్పర అంగీకార ఒప్పందం జరిగింది. ఇందులో భాగంగా రాబోయే మూడేళ్లలో పశువైద్యులు, రైతులకు యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్, వన్ హైల్త్ ప్రమోషన్ పైన శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. పశువైద్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ రవీంద్రారెడ్డి , సద్గురు మేనేజ్మెంట్ కన్సల్టెంట్ ప్రతినిధి హేమలత ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. పశువైద్యులకు ఏటా మూడు సార్లు పశువైద్య కళాశాల రాజేంద్రనగర్, పశువైద్య కళాశాల కోరుట్ల, పశువైద్య కళాశాల మామునూరులో శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న అధికారులు

కార్యక్రమంలో యూనివర్సిటి రిజిస్ట్రార్ జ్ఞానప్రకాశ్, విస్తరణ సంచాలకులు మహేందర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ గోపాల్‌రెడ్డి, ,కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డు ఫెస్ట్‌లో సత్తా చాటిన భానోదయ విద్యార్థులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ బి.భాస్కర్

అత్తాపూర్: సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి అవార్డు ఫెస్ట్‌లో భానోదయ హై స్కూల్ విద్యార్థులు నాలుగు ర్యాంకులు సాధించారు. వి.తనూజ స్టేట్ 1వ ర్యాంక్, జి.జ్యోతిక స్టేట్ 5వ ర్యాంక్, సరిత తివారీ స్టేట్ 6వ ర్యాంక్, మరియం జమానీ బేగం స్టేట్ 8వ ర్యాంకులు సాధించారు. మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థిని వి.తనూజకు రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు. జాతీయ స్థాయి సెమ్స్ ఒలంపియాడ్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాంటెండెంట్ బి.భాస్కర్, ప్రిన్సిపాల్ భవానీ ప్రత్యేకంగా అభినందించారు.

నిమజ్జనానికి కొలనులు సిద్ధం

మణికొండ: ఓ వైపు వినాయక నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతుండగా మరో వైపు విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు నిమజ్జన సాగర్‌లు, చెరువుల వద్ద మున్సిపల్ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వినాయకులను కోకాపేట, నార్సింగి నల్లచెరువులలో నిమజ్జనం చేయనుండగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ చిన్న చెరువు, మణికొండ ఎల్లమ్మ చెరువులను సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయా చెరువుల వద్ద అవసరమైన క్రేన్‌లు, వీధి దీపాలు, సిబ్బందిని ఏర్పాటు చేశారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం మూడో రోజు పూజలు చేసి గృహాలు, చిన్న అపార్ట్‌మెంట్‌లలోని చిన్న విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జన సాగర్‌లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నార్సింగి మున్సిపల్ కమిషనర్ బి. సురేందర్‌రెడ్డి, మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ తెలిపారు.



కోకాపేట చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ సురేందర్‌రెడ్డి తదితరులు

జై బోలో గణేష్ మహరాజ్ కీ...

- భక్తి శ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు
- పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు
- సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ
- పెద్ద ఎత్తున హాజరవుతున్న భక్తులు

సాక్షి, రాజేంద్రనగర్ జోన్ బృందం: గణేష్ మహారాజ్‌కి జై.. జై బోలో గణేష్ మహరాజ్‌కి.. అనే నినాదాలతో వినాయక మండపాలు మారుమోగుతున్నాయి. మణికొండ, రాజేంద్రనగర్, బండ్లగూడ, అత్తాపూర్, నార్సింగి డివిజన్ల పరిధిలోని పలు అపార్ట్‌మెంట్‌లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో మూడో రోజు బుధవారం ఉదయం, సాయంత్రం భక్తి శ్రద్ధలతో లంబోధరునికి పూజలు నిర్వహించారు. పలు మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లలకు ఆటల పోటీలను నిర్వహిస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు వినాయక మండపాల వద్ద ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మణికొండ పోచమ్మ కాలనీలో వినాయక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



అలకాపూర్ టౌన్‌షిప్‌లో సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు



నెక్నాంపూర్ హనుమాన్ దేవాలయంలో



అలకాపూర్ గేటెడ్ కమ్యూనిటీలో..



మణికొండ క్వార్టర్స్‌లో..



క్రేన్‌కు పూజలు నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



డీసీపీ, అడిషనల్ డీసీపీ తదితరులు.

శంషాబాద్ మున్సిపల్ కార్యాలయంలో..

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ కార్యాయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండి గోపాల్ యాదవ్, కమిషనర్ భోగీశ్వర్లు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ డి. వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు రేఖా, వై. కుమార్, సంజయ్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గణేషుడికి పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ గోపాల్ తదితరులు

700 విగ్రహాల నిమజ్జనం

రాజేంద్రనగర్: గణేష్ నవరాత్రి ఉత్సవాలు రాజేంద్రనగర్ సర్కిల్‌లో ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం మూడో రోజు కావడంతో తమ ఇళ్లల్లో ప్రతిష్ఠించిన గణనాథులను భక్తులు నిమజ్జనానికి పత్తికుంటకు తరలించారు. పత్తికుంటలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది గణనాథులను భక్తుల నుంచి విగ్రహాలను స్వీకరించి నిమజ్జనం చేశారు. భారీ గణనాథులను వేసేందుకు ఉదయం పత్తికుంట వద్ద ఏర్పాటు చేసిన క్రేన్‌కు పూజలు నిర్వహించి గణేష్ ఉత్సవ సమితి సభ్యులు నిమజ్జనాన్ని ప్రారంభించారు. ఉదయం నుంచి రాత్రి వరకు దాదాపు 700 గణనాథులను నిమజ్జనం చేసినట్లు జీహెచ్‌ఎంసీ సిబ్బంది తెలిపారు. రాజేంద్రనగర్ బన్సీలాల్‌నగర్‌లో శ్రీ శ్రీనివాస సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, అడిషనల్ డీసీపీ పెరుమాల్ రేష్మి, ఏసీపీ గంగాధర్ సందర్శించారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బండ్లగూడ మేయర్ మహేందర్‌గౌడ్



శ్రీ మణికంఠ భక్త సమాజం ఆధ్వర్యంలో...

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

శంషాబాద్: గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని శంషాబాద్ డీసీపీ నారాయాణ రెడ్డి సూచించారు,. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులకు ప్రజలు సహకరించాలన్నారు. బుధవారం సాయంత్రం ఆయన జోన్ పరిధిలోని పలు వినాయక మండపాలను సందర్శించారు. జోన్ పరిధిలో 1800 వినాయక మండపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 28న నిమజ్జనోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు, మండల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శంషాబాద్ ఏసీపీ రాంచందర్‌రావు, ఆర్‌జీఐఏ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు సుమన్, మన్యం, తదితరులు పాల్గొన్నారు.